# సవాళ్లకే.. సవాల్

## అద్వితీయ ద్వయం!

- కాంగ్రెస్ పార్టీకి గెలుపు గుర్రాలు..
- అవమానాలు దిగమింగి శ్రేణులను ఉర్రూతలూగించి...
- ప్రతిష్ట పెంచిన నేతలు.. రణక్షేత్రంలో దిగ్గజాలు
- గ్యారంటీలకే గ్యారంటీ.. స్ఫూర్తికే ఊపిరి రేవంత్, భట్టి

**హైరాబాద్, ఆంధ్రప్రభ:**

పోరు నష్టం పొందు లాభం... ఇది కాంగ్రెస్‌కు అద్దినట్టు సరిపోతుంది! ఎన్నికలు వస్తే చాలు లెక్కకు మిక్కిలిగా ఉన్న గ్రూపులు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఒక్కటైపోతాయి! అప్పటివరకూ ఏవరే గ్రూపులో ఉన్నారో, ఎందుకు కొట్లాడుకుంటున్నారో తెలియని నేతలు హఠాత్తుగా ఐక్యతా రాగం వినిపిస్తారు. బహుశా ఇది ఏ పార్టీలోనూ సాధ్యం కాదు... ఒక్క హస్తం పార్టీలో తప్ప! ఎడముఖం పెడముఖంగా ఉన్న నేతలంతా ఒకే వేదికపైకి వచ్చి చేయి చేయి కలిపి హృదయానికి హత్తేసుకోవడం కనిపిస్తుంటుంది!తమ పార్టీలో స్వేచ్ఛ కాస్త ఎక్కువని ఆ పార్టీ నేతలే తరచూ జోకులు పేల్చుకుంటుండటం మామూలే. ఈ తరహా సంస్కృతి దేశవ్యాప్తంగా ఉంటుంది. ప్రతి రోజు దెబ్బలాడుకోవడం, ఊరు నుంచి పక్కనున్న పట్నం వెళ్లినంత ఈజీగా నేతలు హస్తిన చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీd ఎన్నికలు వచ్చాయి. అప్పటివరకూ ఊరూ వాడా గడబిడలతో నిండి ఉన్న కాంగ్రెస్‌లో ఒక్కసారిగా మార్పు వచ్చింది! ముందు గెలుద్దాం... తర్వాత చూసుకుందాం! ...అన్నట్టుగా మళ్లీ ఒకే తాటి పైకి నేతలు వచ్చారు... శ్రేణుల్లో ఉత్సాహం నింపారు!

### తెలంగాణలో ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది...

భారాస అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇప్పటికే రెండు పర్యాయాలు అధికారం చేపట్టారు. తనదైన విశిష్ట శైలిలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అజరామరంగా నిర్వహించారు... ఇంకా కొనసాగిస్తున్నారు. అదే సమయంలో భాజపా, కాంగ్రెస్‌లు భిన్న రీతుల్లో అధకారపార్టీపై విరుచుకుపడుతున్నాయి. ఒక దశలో అధికార పార్టీకి ప్రత్యామ్నాయం తామంటే తామేనంటూ సవాళ్లు విసురుకున్నాయి. అయితే, కొన్ని కారణాంతరాలతో కమల వికాసం ఆగిపోయి... ధీటైన పొజిషన్ నుంచి దిగజారింది! అప్పటకే పీసీసీ అధ్యక్ష పదవిలో యువతను ఉర్రూతలూగిస్తూ ముందుకు సాగుతున్న రేవంత్ రెడ్డి, ఎంతో హుందాగా, సీనియర్ రాజకీయవేత్తగా రాణిస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కల నేతృత్వంలో కాంగ్రెస్ ఒక ప్రణాళిక ప్రకారం భారాసకు ప్రత్యామ్నాయ పార్టీగా కలబడి నిలబడింది!తెలంగాణ ప్రజానీకం కూడా ఎంతో ఆసక్తికరంగా భాజపా, కాంగ్రెస్‌లలో ఎవరు ప్రత్యామ్నాయంగా ఆవిర్భవిస్తారోనని ఎదురుచూశారు. గత ఉదాహరణలను పరిశీలించినా భారాసకు పోటీలో నిలిచి, గెలుస్తారనుకున్న అభ్యర్థులకే ఓట్లేసి గెలిపించిన ఉదంతాలు ఉన్నాయి. దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీ ఎన్నికలను పరిశీలిస్తే ఇద స్పష్టమవుతుంది. కచ్చితంగా భారాసకు ధీటైన ప్రత్యామ్నాయం అనుకున్నవారికే ఓటేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లోనూ అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ అభ్యర్థుల్లో ఆయా స్థానాల్లో ఎవరు బలంగా ఉంటే వారికే ఓట్లేయడం గమనార్హం!భారాసకు నిజమైన ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించడానికి కాంగ్రెస్‌లో దిగ్గజ ద్వయం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కల కృషి అనన్య సామాన్యం. ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని రేవంత్‌రెడ్డి చేపట్టారు. ఆ తర్వాత ఎన్నో ఒడిదొడుకులు... గ్రూపుల అసంతృప్తి, అసమ్మతి రాగాలు... అలకలు, ఫిర్యాదులు! తమ వర్గానికి పార్టీ పదవులు ఇవ్వలేదని, తమ స్థాయికి తగిన పదవి ఇవ్వలేదంటూ రోజుకో రీతి, పూటకో పద్ధతిలో నిరసనలు. గాంధీభవన్ నిరసనల భవన్‌గా మారిపోయింది. ప్రతి ఒక్కరిని అనునయిస్తూ, గదమాయిస్తూ తనదైన శైలిలో రేవంత్‌రెడ్డి పరిస్థితులను ఒక్కొక్కటిగా చక్కదిద్దారు... అదే సమయంలో పదునైన ప్రసంగాలు, విమర్శలతో యువతను ఆకట్టుకున్నారు.

### ఆ అనుభవం కలిసి వచ్చింది..

టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలిసి వచ్చింది. అటు తెదేపా అభిమానులు, సెటిలర్లు కూడా రేవంత్‌లో తమ భవిష్యత్ నేతను చూసుకున్నారు!ఎన్నో అవమానాలను దిగమింగి శ్రేణుల అభిమానాన్ని రేవంత్ చూరగొనగలిగారు... రేపు తప్పకుండా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురాగల సమర్థుడన్న నమ్మకాన్ని కుదర్చగలిగారు. దీంతో డిపాజిట్ల గల్లంతు స్థాయి నుంచి భారాసకు నిజమైన ప్రత్యామ్నాయం కాంగ్రెస్సేనన్న స్థాయికి తీసుకువెళ్లగలిగారు. కీలక నేతలు చేతులెత్తేసిన వేళ... నేడు ప్రతి సర్వేలోనూ కాంగ్రెస్ దూసుకువస్తోందన్న స్థాయికి పార్టీ ప్రతిష్టను పెంచగలిగారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇక కచ్చితంగా భారాసతో కలబడి నిలబడగలిగేది కాంగ్రెస్సేనన్న అంచనాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.ఇక రాజకీయాల్లోనే పెద్దమనిషిగా పేరుపొందిన సీఎల్పీ నేత గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అసెంబ్లీdలో కాని, వెలుపల కాని, ప్రచారంలో కాని, పరిస్థితి ఏదైనా ఆయన నిబ్బరం కోల్పోరు... సంయమనం ఆయన నైజం... ఆత్మవిశ్వాసం ఆయన ప్రతి కదలికలోనూ కనిపిస్తుంది! ఇంత మర్యాద, మన్ననలను పొందిన నాయకులు కాంగ్రెస్‌లో అతి తక్కువ మంది! వారందరిలో ముఖ్యంగా చెప్పుకోవలసింది భట్టి విక్రమార్క అంటే అతిశయోక్తి కానే కాదు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా ఆయన తనదైన శైలిలో సీఎల్పీ నేతగా రాణించారు. అధికారపక్షం నుంచి ఎంత కవ్వించినా, సవాళ్లు ఎదురైనా ఆయన చిరునవ్వే సమాధానంగా చెప్పేవారు. పైగా తనకు లభించిన సమయాన్ని చక్కగా విశ్లేషణలు, గణాంకాలతో వివరించి అధికార పక్షం పొరపాట్లను ఎత్తి చూపించేవారు. కొన్ని సందర్భాల్లో అధికారపక్షం నుంచి కూడా ఆయనకు ప్రశంసలు రావడమే ఇందుకు నిదర్శనం.

### నిజాయితీ, నిబద్ధతకు మారుపేరు భట్టి..

ఇంత నిజాయితీ, నిబద్ధత కలిగిన నేత కాబట్టే ఆయన పాదయాత్రను ప్రకటించగానే శ్రేణులు ఒక్కసారిగా కదిలివచ్చాయి. మండు టెండల్లో సైతం ఆయన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా పల్లెలు, పొలాలతో పాటు అన్ని ప్రాంతాలను చుట్టేసి అందరివాడుగా ఆప్యాయతానురాగాలను సొంతం చేసుకున్నారని రాజకీయ పండితులే ఒప్పుకుంటున్నారు. ఒక ఎస్సీ నేతగా కాకుండా రాష్ట్రస్థాయి నేతగా ఆయన పొందిన గుర్తింపు కాంగ్రెస్‌లో ఒక అపూర్వ అధ్యాయంగా పేర్కొంటున్నారు. జరుగనున్న ఎన్నికల్లో కచ్చితంగా ఆయన ప్రభావం ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. సామాజికవర్గాల నుంచే కాకుండా నైతిక విలువలు, సంప్రదాయ రాజకీయాలకు విలువనిచ్చే వారందరి మద్దతు తప్పకుండా ఆయనకు తద్వారా కాంగ్రెస్‌కు లభిస్తుందని విశ్లేషిస్తున్నారు. ఎవరెన్ని మాట్లాడినా హస్త విలాప పొజిషన్ నుంచి హస్త వికాస చర్చ వరకూ కాంగ్రెస్‌లో వచ్చిన ప్రతి మార్పు ఆ ఇద్దరి కష్ట ఫలితమేనని కాంగ్రెస్ కేడర్ ముక్తకంఠంతో గొంతెత్తి చాటడం వారి కష్టానికి తగిన గౌరవంగా భావించవచ్చు.నవంబర్ 30న జరిగే కురుక్షేత్ర సమరంలో కాంగ్రెస్ గెలుపు తీరాలకు చేరినా లేదా పోరులో నాలుగడుగుల వెనుక ఆగినా ఆ ఘనత మాత్రం వీరిద్దరిదేనని రాజకీయా పండితుల నిస్సందేహ అభిప్రాయం! దేశంలోనే మహోన్నత స్థానంలో ఉన్న భాజపాను రాష్ట్రంలో వెనక్కి నెట్టి రేసులో ముందుకు వచ్చి అధికార భారాసను ఢీకొడుతున్న కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చిన ఘనత నిస్సందేహంగా వీరిదే.





## బీఎస్సీనర్సింగ్‌లో 3500 సీట్లు ఖాళీ

- నిబంధనలు సడలించాలంటన్న విద్యార్థులు
- ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే నిర్ణయం
- అక్టోబర్ 31 ప్రవేశాలకు చివరి తేదీ
- తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న అనిశ్చితి



**భద్రాచలం, అక్టోబర్ 28 (ప్రభ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రవ్యాప్తంగా 3500 నర్సింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. దీనికి సంబంధించి ఉన్న నిబంధనలు సడలించాలంటూ విద్యార్థులు వేడుకుంటున్నారు. గతంలో కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీలో, ఇంటర్మీడియట్లో బైపిసి తో వున్న విద్యార్థుల మార్కులు ప్రామాణికంగా ప్రవేశాలు జరిగాయి. ఈ విద్యా సంవత్సరంలో గవర్నమెంట్ ద్వారా ప్రవేశాలు పొందేవారు తప్పనిసరిగా ఎంసెట్ లో క్వాలిఫై అయి ఉండాలని, యాజమాన్య కోట సీట్ల కోసం నీట్లో క్వాలిఫై అయి ఉండాలని నిబంధనలు పెట్టారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 102 నర్సింగ్ కళాశాలలో ఉన్న 6,500 సీట్లకు గాను 3000 సీట్లు మాత్రమే నిండాయి. నువ్వు చెప్పు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో తమిళనాడు ఆంధ్ర ప్రదేశ్ ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశల విషయమై ఆయా రాష్ట్రాలు అర్హత ప్రమాణాలను సడలించగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఇంకా అనిశ్చితి కొనసాగుతుంది. ఇంటర్ మార్కులు ప్రామాణికంగా ప్రవేశాలు జరిగితే లబ్ధి పొందేది ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ చెందిన విద్యార్థులే. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు అక్టోబర్ 31 చివరి తేదీగా నిర్ణయించింది. కొద్దిరోజుల్లో ప్రవేశాలకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ముగింపు పలకనుంది, ఈ క్రమంలో ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కళ్లు తెరిచి 3500 మంది విద్యార్థులకు బిఎస్సి నర్సింగ్ అవకాశాన్ని అందించాలని కోరుతున్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ బస్సుయాత్ర కంటిన్యూ

తెలంగాణలో మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నా.. కాంగ్రెస్ మాత్రం ఫుల్ జోష్‌లో ఉంది. కారణం ఆ పార్టీలోకి ఈమధ్య వలసలు పెరిగాయి. ఢిల్లీ హైకమాండ్ పరిస్థితులపై బాగా ఫోకస్ పెట్టింది. దానికి తోడు అభ్యర్థుల 2వ జాబితా రిలీజ్ చేసి, మొత్తంగా 100 మంది అభ్యర్థుల పేర్లను ఇప్పటివరకూ రిలీజ్ చేసినట్లైంది. ఇంకా మిగిలింది 19 మాత్రమే. అందువల్ల ఇకపై కాంగ్రెస్ నుంచి మరింత జోష్ కనిపించే అవకాశాలు ఉన్నాయి.తొలివిడత విజయభేరి బస్సుయాత్ర 3 రోజులు సాగింది. అందులో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొనడంతో మంచి రెస్పాన్స్ వచ్చింది. రెండో విడతను ఏకంగా 6 రోజులు నిర్వహించబోతున్నారు. ఇందులో 6 లోక్ సభ, 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం ఉంటుంది. మొదటి విడతలో 5 లోక్‌సభ, 7 అసెంబ్లీ స్థానాల్లో ప్రచారం సాగింది.తొలి విడత బస్సు యాత్రను ములుగు జిల్లా.. రామప్ప దేవాలయం నుంచి ప్రారంభించగా.. ఇవాళ మలి విడతను వికారాబాద్ జిల్లా, తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి ప్రారంభించి, నవంబర్ 2న మల్కాజ్‌గిరి అసెంబ్లీ స్థానంలో ముగిస్తారు. తాండూరు ఇప్పుడు చల్లగా ఉంటుంది. అందువల్ల ఇవాళ యాత్రలో ఎక్కువ మంది పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.ఇవాళ ప్రచారంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొనబోతున్నారు. రేపు ఆదివారం AICC అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొని, కార్నర్ సమావేశాల్లో ప్రసంగిస్తారు. తర్వాతి రోజుల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు, సీఎల్పీ నాయకులు ఇలా చాలా మంది




రాబోతున్నారు.ఇవన్నీ గమనిస్తే, ఈసారి తెలంగాణపై కాంగ్రెస్ గట్టిగానే ఫోకస్ చేసినట్లు మనం అర్థం చేసుకోవచ్చు. 100 మంది అభ్యర్థులు ఇప్పుడు ఆయా నియోజకవర్గాల్లో జోరుగా ప్రచారం చేయడం ఖాయం. ఎన్నికల ప్రచారానికి ఇంకా 32 రోజులే టైమ్ ఉంది. అందువల్ల అభ్యర్థులు జోరు పెంచే అవకాశాలు ఉన్నాయి.

## వైద్యురాలి నిర్లక్ష్యం?

### ప్రసవం కోసం వెళ్లి తల్లి బిడ్డ మృతి



**ఆంధ్రప్రదేశ్..** తిరుపతిలో జరిగింది. తిరుచానూరు కొత్త వీధిలో నివాసముంటున్న రవి కుమార్ రెడ్డి, హంస వేణి దంపతుల రెండవ కుమార్తె లీలావతి (29)కి ఈనెల 21న పురిటి నొప్పులు రాగా.. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. మర్నాడు 22న ఆమె ఓ ఆడపిల్లకు జన్మని చ్చించిది. ఐతే.. కొద్దిసేపటికే తల్లి, బిడ్డ మృతి చెందారు.సంవత్సరం కిందటే పెరుమో ళ్లపల్లికి చెందిన చరణ్ రెడ్డితో లీలావతికి వివాహం జరిగింది. ఇప్పుడు ఆ ఫ్యామిలీ తల్లీ బిడ్డను కోల్పోయింది. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని మృతురాలి తల్లి హంసవేణి ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయం వేరెవరికి జరగకూడదని భావించి, తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఈనెల 27న కంప్లైంట్ ఇచ్చారు. చరణ్ రెడ్డి.. తిరుపతి రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అసలేం జరిగిందో పోలీసులు తేల్చాల్సి ఉంది.




- ఎన్టీఆర్ జిల్లాలో టుబడ్డ 250 కేజీల గంజాయి..
- కీసర టోల్గేట్ వద్ద కాపు కాసి పట్టుకున్న పోలీసులు..
- కంటైనర్ ద్వారా తరలించేందుకు ప్రయత్నించిన నిందితులు...



## ఏపీలో భారీగా గంజాయి స్వాధీనం

**ఎన్టీఆర్ ప్రభ న్యూస్ బ్యూరో**

జిల్లావ్యాప్తంగా గంజాయి రవాణా విక్రయాలపై ఉక్కుపోదం మోపుతున్న పోలీసులను కల్లుగప్పి మాఫియా పెద్ద ఎత్తున గంజాయిని జిల్లా సరిహద్దుల గుండా తీసుకుపోతుంది. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలకు నడిబొడ్డుగా ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్టు వేసేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న ఎక్కడో అక్కడ ప్రతిరోజు గంజాయి పట్టుబడితోనే ఉంది. విశాఖపట్నం నుండి పెద్ద ఎత్తున గంజాయిని ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడ మీదుగా రాష్ట్రాల సరిహద్దులను నటిస్తున్నారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా నుండి పెద్ద ఎత్తున గంజాయిని రాష్ట్రం సరిహద్దు దాటించేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు కట్టడి చేశారు. భారీ కంటైనర్ లో విశాఖపట్నం నుండి వేరే ప్రాంతానికి తరలిస్తున్న 250 కేజీల గంజాయిని వలవేసి పట్టుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా లోని కంచికచర్ల మండలం కీసర గ్రామ టోల్ గేట్ వద్ద కంటైనర్ లారీ ను పోలీసులు తనిఖీ చేయగా అందులో భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది.సుమారు 250 కేజీల గంజాయ నీ పోలీసులు స్వాధీనం చేసుకుని కంచికచర్ల పోలీస్ స్టేషన్ కి తరలించారు. అంతేనర్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆరలలో ఈ గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారు. కంటైనర్ డ్రైవర్ తో పాటు మరో ముగ్గురుని కంచికచర్ల సిఐ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయి తరలిస్తున్న లారీ వైజాగ్ నుండి హర్యానా వెళుతున్నట్లుగా పుట్టించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.